క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆలిండియా రేడియో, 11కేవీ లెక్చరర్స్ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ను నిలిపి వేయనున్నారు.

జ్ఞానంతోనే దేశాభివృద్ధి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఆమనగల్లు: జ్ఞానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని కందుకూరు డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శంకర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం జ్ఞాన ప్రచార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో శంకర్ మాట్లాడుతూ మహనీయులు జ్ఞానం ద్వారానే సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చారని గుర్తుచేశారు. సామాజిక, సంస్కృతిక, ఆర్థిక రంగాల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. అంబేడ్కర్ విద్యతోనే భారత రాజ్యాంగాన్ని రూపొందించారని, జ్ఞానం ద్వారానే సమాజంలో చైతన్యాన్ని రగిలించారని పేర్కొన్నారు. మహనీయులు చూపిన దారిలో ప్రతి ఒక్కరూ పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలు, మహేశ్, రాజ్‌కుమార్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, ఎస్‌టీయూ నేతలు

ఆమనగల్లు: విద్య కేవలం ఉద్యోగం కోసం కాకుండా.. విలువలు, విజ్ఞానాన్ని అందించే విధంగా ఉండాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నేటి సమాజంలో విలువలతో కూడిన విద్య అవసరమని అభిప్రాయపడ్డారు. ఆదివారం ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్, జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ అసోసియేట్ అధ్యక్షుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి, హైదరాబాద్‌లో కసిరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్‌టీయూ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయనను ఎస్‌టీయూ నాయకులు ఘనంగా సత్కరించి.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాతలని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి భార్గవి, రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బాలనర్సింహ, నాయకులు పరమేశ్, తాహేర్ అలీ, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రామలక్ష్మయ్య, మక్బూల్, శ్రీనివాసాచారి, రమేశ్, రాజమల్లయ్య, నవీన్, బాలకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పథకాలు చేరువయ్యేలా కృషి

మొయినాబాద్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీం భరత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్రిస్మస్‌కు ముందే గిఫ్టులు ఇవ్వాలనుకున్నామని.. అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందన్నారు. ప్రభుత్వం అందించే ఆరు గ్యారంటీ పథకాలు ప్రతి గ్రామంలో అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. పార్టీ కార్యకర్తలు సైతం ప్రభుత్వ పథకాలను ప్రజలకందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, అధికార ప్రతినిధి గౌరి సతీశ్, మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లేష్ యాదవ్, వీరభద్రస్వామి, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, వాసుదేవ్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు రాజు, జైపాల్‌రెడ్డి, రాములు, ఆంజనేయులుగౌడ్, నిరంజన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా శ్రీరాముని అక్షితలు

భక్తిశ్రద్ధలతో పంపిణీ చేసిన రామభక్తులు



కందుకూరు: దాసర్లపల్లిలో అక్షితలకు పూజలు నిర్వహించిన భక్తులు

మహేశ్వరం: అయోధ్య బాలరాముని చెంత పూజ చేయబడిన అక్షితలు మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామం బీఆర్ఆర్ మ్యాక్ ప్రాజెక్టులో గడపగడపకు వితరణ కార్యక్రమం గ్రామస్తులు ఆదివారం నిర్వహించారు. మ్యాక్ ప్రాజెక్టులో నివాసం ఉంటున్న గాన కోకిల ఎస్పీ.జానకి కలిసి అక్షితలను అందజేశారు. మెహబ్బత్‌నగర్ గ్రామంలో రామమందిరం అక్షితలను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగయ్య, ఎంపీటీసీ రామిరెడ్డి ,ఉప సర్పంచ్ శ్రీహరిముదిరాజ్, సర్పంచ్ సువర్ణ, ఉప సర్పంచ్ మానస, బీజేపీ నాయకులు శ్రీరాములు యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మ్యాక్ క్లబ్ సభ్యులు గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చెల్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లిలో అయోధ్య నుంచి తెచ్చిన శ్రీరాముడి అక్షితలను ఆదివారం సర్పంచ్ పి.బాలమణిఅశోక్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుడు రెవెళ్ల రాజుశర్మ సమక్షంలో దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం రామ భక్తులు ఇంటింటికీ తిరిగి అక్షితలు అందజేశారు.

గడప గడపకూ..

మీర్‌పేట: అయోధ్య రామయ్య అక్షితలను ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి రాఘవేంద్ర నగర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గడప గడపకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నర్సింహ మాట్లాడుతూ.. జనవరి 22న అయోధ్యలో భవ్యమైన రామాలయ ప్రారంభోత్సవం, శ్రీరాముడు కొలువుదీరడంతో కోట్లాది మంది భారతీయుల కళ నెరవేరిందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణ, ప్రతినిధులు మారుతి, నిరంజన్, భానుప్రకాశ్, శివ, శంకర్, విజయ్, శ్రీను, కొండల్, రఘు, రాజ్‌కుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అక్షితల వితరణ

తుక్కుగూడ: అయోధ్యలో భవ్యమైన రామమందిరం ప్రారంభం సందర్భంగా ఆదివారం తుక్కుగూడలో బీజేపీ ఆధ్వర్యంలో అక్షితలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు ద్వారా ఇంటింటికీ వితరణ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

జైశ్రీరాం అంటూ..

హుడాకాంప్లెక్స్: అయోధ్యలోని శ్రీరాముని జన్మస్థలమైన పుణ్యక్షేత్రంలో రాముల వారి విగ్రహ ప్రతిష్ట వైభవోపేతంగా ఈ నెల 22న జరగనుందని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. అక్షితలను దేశవ్యాప్తంగా రామభక్తులు ఇంటింటికీ చేరుస్తున్నారని తెలిపారు. ఆదివారం డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరకాలనీ మహిళలంతా జైశ్రీరాం అంటూ అక్షితలను అందజేశారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, అంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: రామ భక్తులు..



హుడాకాంప్లెక్స్: అక్షితల పంపిణీలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు



తుక్కుగూడ: అక్షితల వితరణ చేస్తున్న బీజేపీ నాయకులు



మీర్‌పేట: రాఘవేంద్రనగర్ కాలనీలో అక్షితలు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహ

ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన

ఆన్‌లైన్‌లో నమోదుకు కసరత్తు

బడంగ్‌పేట్: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అధికారులు నిమగ్నం అయ్యారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శిక్షణ ఇప్పించి లబ్ధిదారుల దరఖాస్తు పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత, కమిషనర్ సుమన్‌రావు, ప్రజాపాలన ఇన్‌చార్జి అధికారి రాజేశ్వర్‌రెడ్డి, మేనేజర్ నగేష్‌బాబు ఆదివారం నమోదు ప్రక్రియను పరిశీలించారు. కార్పొరేషన్‌లోని 32 డివిజనల్లో మొత్తంగా 32,147 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి కాగానే ఇంటికి పరిశీలన నిమిత్తం అధికారులు రానున్నారు. ఈ నెల 17 తేదీ లోపు నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలేజీ యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

లయన్స్‌క్లబ్ సేవలు వినియోగించుకోవాలి

ఎంపీపీ మంద జ్యోతిపాండు



అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ తదితరులు

కందుకూరు: నిస్వార్థంగా, స్వచ్ఛందంగా లయన్స్ క్లబ్ ప్రజలకు అందించే సేవలను వినియోగించుకోవాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు తెలిపారు. కందుకూరు, ఆమన్‌గల్లు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరు చౌరస్తాలో ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ రోజు వారాంతపు అంగడి ఉందని, దీంతో వివిధ దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఆకలి తీర్చడం గొప్ప విషయమన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ గంగాపురం చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా మీల్స్ ఆన్ వీల్స్ పేరుతో ఉచిత అన్నదాన వితరణ కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ మల్టీపుల్ జిల్లా నిర్వహిస్తుందన్నారు. ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ సండడి నరేందర్‌రెడ్డి కుమారై అంకితారెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వారి సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, కందుకూరు లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, సెక్రటరీ కె.వెంకటేశ్వర్లుగుప్తా, ఆమన్‌గల్లు క్లబ్ సభ్యులు రాజేందర్, బిచ్చానాయక్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

కందుకూరు: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో నవతరం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం క్రికెట్ లీగ్ నాలుగో సీజన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, నవతరం యూత్ మాజీ అధ్యక్షుడు తాళ్ల కార్తీక్, అజీజ్, వెంకటేష్‌గౌడ్, దీక్షిత్‌రెడ్డి, రఘుబాబు, వినోద్‌చారి, ప్రశాంత్‌చారి, మహేందర్‌రెడ్డిలు హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు సాయికుమార్, వంశీ, అఖిల్, మల్లేష్, ప్రశాంత్, పృథ్వీ, మహేందర్, చోటు, శేఖర్, దిలీప్, నవీన్, వినయ్, నరేందర్, సూరి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

యువత క్రీడల్లోనూ రాణించాలి



టీపీఎల్–9 క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కరుణాకర్‌రెడ్డి

జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి

మహేశ్వరం: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రంగారెడ్డి జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ మద్ది కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మలూరులో టీపీఎల్–9 పోటీలను ఆయన స్థానిక ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, క్రీడాకారులతో కలిసి పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం కల్గిస్తామన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామిరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీహరిముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు నర్సిరెడ్డి, జంగయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ నర్సింహాయాదవ్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు గోవర్దన్ చారి, శ్రీధర్‌రెడ్డి, చంద్రయ్య, సురేందర్‌రెడ్డి గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఆమనగల్లు: మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామంలో బహుజన విప్లవ వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లాజీగౌడ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితులపై చర్య తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, మండలశాఖ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, నాయకులు సతీశ్‌గౌడ్, నర్సింహాగౌడ్, నారాయణగౌడ్, లక్ష్మీపతి, బాలకృష్ణగౌడ్, శివ, నరేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాల మేరకు బస్సులు

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ సంస్థను లాభాల బాటలోకి తీసుకువచ్చినప్పుడే అభివృద్ధి సాధించినట్లని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో డీఎం ఉష ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీజినల్ మేనేజర్ శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. ఆర్టీసీపై ప్రజల్లో పూర్తి విశ్వాసాన్ని కల్పించి సంస్థ అందిస్తున్న సేవలను ప్రయాణికులకు వివరించాలని సూచించారు. డ్రైవర్లు, కండక్టర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజలు ప్రైవేట్ వాహనాలలో కాకుండా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే విధంగా కృషి చేయాలని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులను నడపాలని, ప్రయాణికులు కోరిన చోట బస్సును ఆపితే సంస్థకు లాభాలు వస్తాయని అన్నారు. కార్యక్రమంలో సుధాకర్, జంగయ్య, డిపో సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 4వ వార్డుకు చెందిన శ్రీనివాసరాజు కుమార్తె నందిని అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీంతో రూ. 2లక్షల ఎల్‌ఓసీ మంజూరు అయింది. ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్థానిక మాజీ కౌన్సిలర్ అనుపమ, నందినికి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణారెడ్డి, సంతోశ్‌గౌడ్, రాకేశ్‌గౌడ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఆన్‌లైన్ ప్రక్రియ

ప్రజాపాలన నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి

తుక్కుగూడ: దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని ప్రజా పాలన మహేశ్వరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ వ్యాప్తంగా 8,355 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తుదారుడు ఫారంలో పేర్కొన్న కుటుంబ వివరాలు, ఆరు గ్యారంటీ పథకాలతో ప్రతి అంశాన్ని ఆన్‌లైన్‌లో చేయాలన్నారు. తప్పులు దొర్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, మేనేజర్ వెంకటేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఇస్రో శాస్త్రవేత్త రఘునందన్, జగన్‌మోహన్‌రావు

హస్తినాపురం: విద్యార్థులు విద్యతో పాటు వినయంతో వ్యవహరించినప్పుడే వారు అన్నిరంగాలలో రాణిస్తారని ఇస్రో శాస్త్రవేత్త రఘునందన్ అన్నారు. ఆదివారం నిర్వహించిన హస్తినాపురం అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాప్సోడి 2024 పేరుతో నిర్వహించిన వార్షిక వేడుకలను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల చైర్మన్ జగన్ మోహన్‌రావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గత సంవత్సరం పాఠశాల సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ వేడుకలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇస్రో శాస్త్రవేత్త రఘునందన్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక లక్ష్యాన్ని ఎంచుకొని అది సాధించే దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సీఈఓ మదన్‌మోహన్‌రావు, రామారావు, ప్రిన్సిపాల్ రమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా పడిపూజ

పూజలో పాల్గొన్న రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న స్వాములు, నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అయ్యప్ప మహాపడి పూజలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం మంగల్‌పల్లి పటేల్‌గూడ మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో వైభవంగా పడిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప నామ స్మరణతో పటేల్‌గూడ మర్మోగింది. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ లక్ష్మీపతిగౌడ్, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ మహిపాల్, మాజీ జెడ్పీటీసీ అయిలయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, సురేందర్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

మల్‌రెడ్డికి సత్కారం

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన మల్‌రెడ్డి రంగారెడ్డిని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీజేఐటీలో విద్యార్థుల సమ్మేళనం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగాలు చేస్తూ సమాజ సేవ కార్యక్రమాలలో పాలు పంచుకున్నప్పుడే గుర్తింపు వస్తుందని విద్యా జ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి బాబారెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని విద్యా జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో 2023 సంవత్సరంలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన 400 మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.



ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న లచ్చిరెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: వాసవీ వనితా క్లబ్ ప్రశాంత్ నగర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. పోటీలను ప్రారంభించిన అనంతరం వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ 102 డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ కొత్తమాసు రమేష్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షురాలు రావికంటి సత్య, శ్రీ సెక్రటరీ రుద్రంగి విజయ, కోశాధికారి సవిత విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి యాదలక్ష్మి కుమారి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు.

బీఎన్‌రెడ్డి నగర్‌లో..

లింగోజిగూడ: బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్–1లో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ధన్‌రాజ్, ఉపాధ్యుడు నవీన్, నాయకులు రవికిరణ్, రాములు, వెంకట్‌రెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, ప్రభాకర్, విష్ణువర్ధన్, పవన్‌రెడ్డి, శ్రావణ్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

ఇబ్రహీంపట్నం రూరల్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగర జంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ సర్కార్ కార్మిక చట్టాలు అమలు చేయకపోవడం వల్లే ఓటమి పాలైందన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక చట్టాలను, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యదర్శిగా నర్సింహ

ఆదిబట్ల మున్సిపాలిటీ సీఐటీయూ కార్యదర్శిగా నర్సింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తానని నర్సింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామేల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్, బుగ్గరాములు, ఎల్లేశ్, బాబు, రమేశ్, యాదయ్య, పుష్ప, జయమ్మ, అండాలు, లింగమయ్య, శివరాజ తదితరులు పాల్గొన్నారు.